ఈనాడు
విజయనగరం
శుక్రవారం అక్టోబరు 11, 2024 3



పండగకు ఆహ్వానం

విజయనగరం ఉత్సవాలు, పైడి తల్లి పండగకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పలువురు ప్రజాప్రతినిధులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గురువారం కలిసి, ఆహ్వానపత్రికలు అందించారు.

– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

3 గంటలకే సిరిమాను ఊరేగింపు ప్రారంభం


మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో జేసీ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పైడి తల్లి సిరిమానోత్సవాన్ని ఈ నెల 15న మధ్యాహ్నం 3 గంటలకే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. రథాల వెనుక అనుమతి ఉన్న వారే పాల్గొనాలని, ఇతరులు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులు ఇబ్బంది పడకుండా సాయంత్రం 5 లోపు ఊరేగింపును ముగించాలని సూచించారు. వీఐపీ దర్శనాలకు నిర్ణీత సమయాన్ని కేటాయిస్తామని చెప్పారు. సాగునీటి సంఘాల ఎన్నికలు, నీటి తీరువా, రేషన్ డీలర్ల హేతుబద్ధీకరణ, స్వీప్ కార్యక్రమం, ధాన్యం సేకరణ, ఈ క్రాప్, ఇసుక సరఫరా, కొత్త ఓటు హక్కు నమోదు.. తదితర అంశాలపై సూచనలు చేశారు. సంయుక్త కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, డీఆర్వో అనిత, పౌర సరఫరాల శాఖాధికారులు మధుసూదనరావు, మీనాకుమారి పాల్గొన్నారు.

చూసొద్దామా..

విజయనగరం వైభవోత్సవం

రాజులు ఏలిన విజయనగరం ఘన చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పేలా రెండు రోజుల పాటు విజయనగరం-2024 ఉత్సవాలకు ఆదివారం శంఖం పూరించనున్నారు.

సంగీత, సాంస్కృతిక, సాహిత్య నిలయమైన విజయనగరం ఉత్సవాలకు సిద్ధమైంది. పైడితల్లి సిరిమాను పండగకు అంగరంగ వైభవంగా ముస్తాబవుతోంది. కూటమి ప్రభుత్వం అందలమెక్కిన తర్వాత జిల్లాలో నిర్వహిస్తున్న తొలి వేడుక కావడంతో అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సంప్రదాయం ఉట్టిపడేలా.. సంస్కృతి వెల్లివిరిసేలా.. వైభవాన్ని చాటిచెప్పేలా, విజ్ఞాన వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. అలనాటి మధుర స్మృతులు గుర్తుకు తెచ్చేలా నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. – ఈనాడు, విజయనగరం



11 గంటలకు ప్రారంభం

ఆదివారం ఉదయం 8 గంటలకు పైడితల్లి ఆలయం నుంచి అయోధ్య మైదానం వరకు వివిధ కళారూపాలతో ఉత్సవ ర్యాలీ (కార్నివాల్) నిర్వహిస్తారు. 11 గంటలకు అయోధ్య మైదానంలో శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారు.

★ అయోధ్య మైదానంలో రెండింటితో కలుపుకొని ఉత్సవాలను 12 వేదికలపై నిర్వహించనున్నారు.

★ గతం కంటే భిన్నంగా, వైవిధ్యంగా, ప్రత్యేకంగా ఈ ఏడాది కార్యక్రమాలు రూపకల్పన చేశారు. కోట వెనుక భాగంలో పైడిమాంబ చరిత్ర, విజయనగర వైభవాన్ని లేజర్ షో ద్వారా ప్రదర్శించడం ఈ ఏడాది ప్రత్యేకత. రంజని శివరంజినికి ఎదురుగా కోటపై సైతం రెండు రోజుల పాటు లేజర్ షో ఉంటుంది.

★ 14న తొలేళ్లు, 15న సిరిమాను సంబరం. ఈ సందర్భంగా ఉత్సవ శోభ నగరం నలుమూలలా అలరించేలా స్వాగత ద్వారాలను, ప్రభుత్వ భవనాలపై, పార్కుల్లో, ప్రధాన కూడళ్లలో మిరిమిట్లు గొలిపే లైటింగ్ ఏర్పాటు చేశారు.

★ అయోధ్య మైదానంలో గతంలో మెగా ఈవెంట్ ఒక్క రోజే జరిగేది. ఈసారి రెండు రోజులు నిర్వహించనున్నారు.

అయోధ్య మైదానం — వేదిక 1



★ సాయంత్రం ఆరు గంటల నుంచి పది గంటల వరకు సంగీత విభావరి. ఈటీవీ జబర్దస్త్ కమెడియన్ హైపర్ ఆది స్కిట్లతో పాటు బెంగాల్ బృందంతో నృత్య ప్రదర్శన. సాహితి చాగంటి, సాయిచరణ్, అరుణ్ కౌండిన్య, దామిని భట్ల సంగీత ఆలాపన.

★ రెండో రోజు ఇదే వేదికపై సినీ గాయకుడు కార్తీక్ బృందంతో మెగా మ్యూజికల్ నైట్.

★ ఫుడ్ ఫెస్టివల్, పెట్‌షో. పారా మోటరింగ్.

మహారాజా కోట — వేదిక 2



★ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సైన్స్ ఫెయిర్, స్టాంపులు, నాణేలు, ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శన.

★ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విజయనగరం చరిత్రను వివరించే లేజర్ షో. ఇక నుంచి దీన్ని ఏడాది పొడవునా కొనసాగిస్తారు.

గురజాడ కళాక్షేత్రం — వేదిక 3



★ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్థానిక కళాకారులతో నాటికల ప్రదర్శన. విజయనగర ఖ్యాతిని చాటిన వివిధ రంగాల ప్రముఖుల చిత్ర ప్రదర్శన.

విజ్జీ స్టేడియం — వేదిక 4



★ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, స్కేటింగ్ పోటీలు.

భారీ బందోబస్తు

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆరు జిల్లాల నుంచి రెండు వేల మంది పోలీసులను బందోబస్తుకు రప్పిస్తున్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షణకు 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏరియల్ సర్వే, నిఘాకు మూడు డ్రోన్లు వినియోగించనున్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించారు.

రాజీవ్ స్టేడియం — వేదిక 5

★ ఈ నెల 12 నుంచి 16 వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ప్రదర్శన.



ఆనంద గజపతి కళా క్షేత్రం — వేదిక 6

★ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు.. సంగీత, నృత్య పోటీలు.




ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్ — వేదిక 7

★ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు భువన విజయం, శతాధిక కవి సమ్మేళనం, సాహితీ గోష్ఠి, సంగీత నవ అవధానం.



లయన్స్ కమ్యూనిటీ హాల్ — వేదిక 8

★ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు గిరిజన కళాకారులతో థింసా నృత్యాలు, కోలాటాలు, జానపద నృత్యాలు. విజయనగరం వైభవాన్ని చాటే లఘుచిత్రం ప్రదర్శన.



బొంకుల దిబ్బ — వేదిక 9



★ సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు కన్యాశుల్కం, సత్య హరిశ్చంద్ర నాటకాల ప్రదర్శన.

కోట — వేదిక 10



★ దీనికి ఎదురుగా ఉదయం 10 నుంచి సాయంత్రం 7 వరకు పులివేషాల ప్రదర్శన.

మాన్సాస్ మైదానం (లోవర్ ట్యాంక్ బండ్ రోడ్) — వేదిక 11

★ ఈ నెల 10 నుంచి 20 వరకు జాతీయ స్థాయి సరస్ మేళా (చేనేత, హస్తకళల తయారీ ఉత్పత్తుల ప్రదర్శన).

★ 13, 14 తేదీల్లో రాత్రి పది గంటల వరకు పుష్ప, ఫల ప్రదర్శన.



వంతెన నిర్మాణానికి అంచనాలు ఇవ్వండి

పవన్, కొండపల్లి ఆదేశాలతో కదలిక


వివరాలు తెలుసుకుంటున్న జేసీ సేధు మాధవన్

జామి, న్యూస్‌టుడే: జామి మండలంలోని శాసనాపల్లి గెడ్డపై వంతెన నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇవ్వడంతో అధికారులు దృష్టి పెట్టారు. కలెక్టరు అంబేడ్కర్ ఆదేశాల మేరకు సంయుక్త కలెక్టరు సేధు మాధవన్ గురువారం గెడ్డను పరిశీలించారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. శాసనాపల్లి నుంచి పెదవేమలి మధ్య 110 మీటర్ల వంతెన నిర్మాణానికి సంయుక్తంగా అంచనాలు తయారు చేయాలని జేసీ ఆదేశించారు. అనంతరం గ్రామస్థులు ఆయనకు సమస్యలు వివరించారు. పీఆర్ డీఈ స్వామినాయుడు, ఎంపీడీవో నీలం అప్పలనాయుడు, తహసీల్దారు కృష్ణలత, డీఈ, ఏఈలు ఉన్నారు.

దుర్గామాతగా కోటదుర్గమ్మ


అలంకరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహం


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పాలకొండ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు గురువారం కోటదుర్గమ్మ దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జాము నుంచే ఆలయం రద్దీగా మారింది. ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కుంకుమ పూజల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

విలువల దీప్తి.. టాటా స్ఫూర్తి


కులం, డబ్బు, అందం, కుటుంబం.. ఇవేవీ మనిషిని ఉన్నతుడిని చేయలేవు. కేవలం శక్తి సామర్థ్యాలు, ఆత్మ విశ్వాసం, పట్టుదలే గొప్పవారిగా తీర్చిదిద్దుతాయి.
– విద్యార్థులు, యువతతో నిర్వహించిన సమావేశంలో రతన్‌టాటా

2018లో రాజాంలో పర్యటన

– న్యూస్‌టుడే, రాజాం

టాటా ఛైర్మన్, పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు రాజాంతో ఎంతో అనుబంధం ఉంది. 2018 డిసెంబరు 10న జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ 25వ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల, నైరెడ్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో టాటా ట్రస్ట్ ఛైర్మన్‌గా ఆయన చేసిన ప్రసంగంలోని ప్రతి మాటా స్ఫూర్తి మంత్రంగా నిలిచింది.

మట్టిలో మాణిక్యంలా రాణించేందుకు ప్రాంతాలు అడ్డు కాదని స్పష్టం చేశారు. మానవత్వం, సంతృప్తి, ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్న దూరదృష్టి, తపన వంటివి ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడతాయని ఉద్బోధించారు. దేశం సుసంపన్నం కావాలంటే విలువలు, నైపుణ్యమున్న వ్యక్తులతోనే సాధ్యమన్నారు. సమాన అవకాశాలు కల్పించేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అద్భుతాలు సృష్టించే నైపుణ్యం సొంతం కావాలంటే అందుకు నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలని సూచించారు. ఎదుటి వారిలో స్ఫూర్తిని రగిలించే వ్యక్తులు ఎన్నటికీ సమాజ నిర్దేశకులవుతారని, జీఎమ్మార్ వంటి వ్యక్తులు మారుమూల ప్రాంతాల నుంచి చేపడుతున్న కార్యక్రమాలు ఇందుకు అద్దం పడుతున్నాయని చెప్పారు. భిన్నమైన రీతిలో మీరు సాగించిన ప్రగతి స్ఫూర్తిగా ఉందని జీఎమ్మార్‌ను ప్రశంసించారు. నైరెడ్‌లో పర్యటించి శిక్షణార్థులతో మాట్లాడారు. శిక్షణ, ఉపాధి అవకాశాలపై అడిగి తెలుసుకున్నారు. వారితో ఫొటోలు దిగారు. జీఎంఆర్ వీఎఫ్ గ్రంథాలయంలో చదువుకుని కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన జగదీశ్వరికి జ్ఞాపిక అందించారు. జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, వరలక్ష్మి దంపతులు టాటాను సత్కరించారు.


జీఎంఆర్‌వీఎఫ్ సేవలను రతన్‌టాటాకు వివరిస్తున్న జీఎంఆర్

ప్రజలకు ఇబ్బందులు రానివ్వొద్దు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి పండగలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ కోసం చేపట్టిన డయల్ యువర్ ఎంపీ కార్యక్రమంలో వచ్చిన సలహాలు, సూచనలను గురువారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిగణనలోకి తీసుకుని, తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు.

14న పరిష్కార వేదిక రద్దు

విజయనగరం అర్బన్: పైడితల్లి ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 14న జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారిణి ఎస్.డి.అనిత తెలిపారు. జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

ఆపరేషన్ స్వేచ్ఛ

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురై వీధుల్లో తిరుగుతున్న బాలలు, వివిధ పనుల్లో ఉన్న బాల కార్మికులను గుర్తించి.. వారిని తిరిగి బడి బాట పట్టించేందుకు ఈ నెల 5 నుంచి 10 వరకు జిల్లాలో 'ఆపరేషన్ స్వేచ్ఛ' చేపట్టారు. ఇందులో భాగంగా కార్మిక శాఖ అధికారులు, ఇతర విభాగాలకు చెందిన వారితో కలిసి పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టామని ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం తెలిపారు. మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇ.నర్సింహమూర్తిని నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఇటుక బట్టీలు, మెకానిక్, దుస్తులు, చెప్పులు, హోటళ్లు, బేకరీలు, మిఠాయిలు, టీ, నగల దుకాణాల్లో తనిఖీలు చేసి పలువురు బాలలను గుర్తించామని చెప్పారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు.


దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు, ఇతర అధికారులు

పల్లె గూటికి అభివృద్ధి పండగ

న్యూస్‌టుడే – గరివిడి, రాజాం, చీపురుపల్లి

గత ప్రభుత్వం అయిదేళ్లూ పల్లెల అభివృద్ధిని పూర్తిగా వదిలేసింది. కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఈక్రమంలో గ్రామాలను అభివృద్ధి దిశగా నడిపేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. 'పల్లె పండగ' పేరుతో ఈ నెల 14 నుంచి 20 వరకు వారం రోజుల పాటు జిల్లాలో సీసీ రహదారులు, డ్రెయిన్లతో పాటు వివిధ రకాల పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

ఈ ఏడాది ఆగస్టు 23న ఒకే రోజు జిల్లాలోని 773 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో రూ.151.90 కోట్ల ఉపాధి హామీ పథకం 'మెటీరియల్' నిధులతో 2,199 పనులు చేపట్టేందుకు పరిపాలనాపరమైన ఆమోదం లభించింది. వీటికి సాంకేతికపరమైన అనుమతులు వచ్చాయి. ఈ నెల 20వ తేదీలోగా మంజూరైన అన్ని పనులనూ ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇప్పటికే ఆర్థిక సంఘం రెండో విడత నిధులు పంచాయతీ ఖాతాలకు జమయ్యాయి. టైడ్, అన్‌టైడ్ నిధులు రూ.30 కోట్ల వరకు అందుబాటులోకి వచ్చాయి. అభివృద్ధి పనులకు ఉపాధి పథకం నిధులు కేటాయించడంతో ఆర్థిక సంఘం నిధులను పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి కనీస అవసరాలకు వెచ్చించుకునే వీలు కలుగుతుందని సర్పంచులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2,199 పనులు.. రూ.151.90 కోట్లు


గరివిడిలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి నోచుకోనున్న ఒక వీధి

పనులు	సంఖ్య	నిధులు (రూ.లక్షల్లో)
సీసీ కాలువలు	174	921.45
సీసీ రహదారులు	668	3,944.02
సీసీ రోడ్లు, డ్రైన్లు	1,272	6,874.53
డబ్ల్యూబీఎం రోడ్లు	59	955.40
బీటీ రహదారులు	19	2,368.00
ఇతర	07	127.45

మండలాల్లోనే గుర్తింపు

గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు ఎక్కడెక్కడ చేపట్టాలో ఇప్పటికే మండల స్థాయిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో గుర్తించారు. వీటిని నామినేటెడ్ పద్ధతిలో పూర్తి చేయనున్నారు. పనులన్నీ పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరగనున్నాయి. ప్రస్తుతం గుర్తించిన వాటిల్లో ఎక్కువగా సీసీ రహదారులు, కాలువలున్నాయి.

త్వరగా పూర్తి చేస్తాం

ఉపాధి హామీ పథకం 'మెటీరియల్' నిధులతో ఆమోదం పొందిన పనులన్నీ ప్రారంభించి సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. నాణ్యతలో రాజీ పడకుండా నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షిస్తాం.

– ఎం.శ్రీనివాస్, ఎస్ఈ, పంచాయతీరాజ్ శాఖ

ఇదీ అభివృద్ధి ప్రణాళిక...

పంచాయతీ రాజ్ సబ్‌డివిజన్	గజపతినగరం	బొబ్బిలి	రాజాం	ఎస్.కోట	విజయనగరం/నెల్లిమర్ల	చీపురుపల్లి
మంజూరైన పనుల సంఖ్య	238	402	403	471	422	263
నిధులు రూ.లక్షల్లో	2563.80	2654.51	2131.18	2820.85	3405.80	1614.71

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుషార్‌రావును పాలకొండ డీఎస్పీ రాంబాబు, సీఐ చంద్రమౌళి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా స్వగ్రామమైన వీరఘట్టం మండలం కత్తుల కవిటి వచ్చిన ఆయనను వీరితో పాటు పలువురు న్యాయవాదులు కలిశారు.
– న్యూస్‌టుడే, పాలకొండ


జస్టిస్ తుషార్‌రావుకు మొక్క అందజేస్తున్న డీఎస్పీ రాంబాబు, చిత్రంలో సీఐ చంద్రమౌళి

పూర్వ విద్యార్థుల ఉదారత

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి గురుకుల పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న హర్షవర్ధన్ ఇటీవల అనారోగ్యానికి గురై విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంతవరకు దాదాపు రూ.9 లక్షలు ఖర్చైంది. బాధిత తల్లిదండ్రులకు చేయూత అందించాలన్న ఉద్దేశంతో గురువారం రూ.లక్ష చెక్కు, రూ.25 వేలు నగదు అందజేసినట్లు పూర్వ విద్యార్థుల సంఘ నేత జోగినాయుడు తెలిపారు.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

గౌరీశ్వరరావుకు 'రైతు నేస్తం' పురస్కారం



రాజాం, న్యూస్‌టుడే: ప్రకృతి సేద్యం రైతు పెంకి గౌరీశ్వరరావుకు 'రైతు నేస్తం' పురస్కారం వరించింది. స్వర్ణభారతి ట్రస్టులో ఈనెల 20న ముప్పవరపు ఫౌండేషన్, రైతు నేస్తం సంస్థల ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందుకోనున్నట్లు ఆయన గురువారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈయన దశాబ్ద కాలంగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. వరి, అపరాలతో పాటు జీడి, మామిడి తోటలను ఈ పద్ధతిలోనే సాగు చేస్తున్నారు.

తెలంగాణకు మన గురువులు

డీఎస్సీలో సత్తాచాటిన జిల్లావాసులు

గత అయిదేళ్లు డీఎస్సీ కోసం ఎదురు చూశారు.. అభ్యర్థుల ఆందోళనతో దిగొచ్చిన నాటి ప్రభుత్వం చివరి నిమిషంలో ప్రకటనిచ్చింది. ఈలోపు ఎన్నికలు రావడంతో వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి.. ఈక్రమంలో తెలంగాణ డీఎస్సీ వారి కలల కొలువుకు మార్గం చూపింది.. పట్టుబట్టి చదవి.. ఉద్యోగాలు పొందారు జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు. బుధవారం జిల్లాలు కేటాయిస్తూ అక్కడి అధికారులు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కొందరు 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు.





తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

ఆడపిల్లలను చాలా మంది బయటకు పంపించరు. కానీ నాపై ఉన్న నమ్మకంతో మా తల్లిదండ్రులు విజయలక్ష్మిబాయ్, అప్పలాచారి ఏనాడూ అడ్డు చెప్పలేదు. వారి ప్రోత్సాహంతో ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ముందుకెళ్లా. 2014- 16 బ్యాచ్‌లో డీఎల్ఈడీ పూర్తిచేశా. ఏపీ డీఎస్సీ- 2019 రాసినా అవకాశం రాలేదు. ఈసారి 80.77 మార్కులు సాధించా. హైదరాబాద్ జిల్లా కేటాయించారు. ఎంతో సంతోషంగా ఉంది. ఏపీ డీఎస్సీకి పోటీ పడేందుకు సిద్ధమవుతున్నా.
– ఎ.ప్రవల్లిక, పున్నపురెడ్డిపేట



వివాహమైనా..

నాకు వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. వారి బాగోగులు, చదువులు చూసుకోవాలి. ఇదంతా నాణేనికి ఒకవైపైతే.. ఉపాధ్యాయిని కావాలన్న లక్ష్యం మరోవైపు. కుటుంబ సభ్యుల సహకారంతో అటువైపే అడుగులు వేశా. 2016లో డైట్ శిక్షణ పూర్తయింది. డీఎస్సీ కోసం గతంలో తర్ఫీదు పొందా. తరువాత ఇంటి వద్దే సాధన చేశా. భర్త కృష్ణ వసతిగృహ సంక్షేమాధికారిగా చేస్తున్నారు. ఆయనతో పాటు తల్లిదండ్రులు, అత్తమామలు ప్రోత్సహించారు. తెలంగాణ డీఎస్సీలో 80.17 మార్కులతో కుమురం భీం జిల్లాలో ఉద్యోగం పొందా.
– స్వాతి, కనిమెరక



ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా..

బీటెక్ చదివినా సాఫ్ట్‌వేర్ వైపు వెళ్లాలని పించలేదు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో తొలుత సచివాలయ సంక్షేమ సహాయకుడిగా ఎంపికయ్యా. కొన్ని నెలలకే దానిని వదిలి డీఎస్సీ రాశా. 2022, 2023లో తెలంగాణ టెట్‌లో రెండు సార్లు వరుసగా మూడో స్థానంలో నిలిచా. 2022 ఏపీ టెట్‌లో 150కి 129 మార్కులొచ్చాయి. ఈసారి ఆఖరి పరీక్షలో వందకు 84.83 లభించాయి. స్కూల్ అసిస్టెంట్ గణితం విభాగంలో మొదటి ర్యాంకు దక్కింది. నాకు ఖమ్మం జిల్లా కేటాయించారు. మా సొంతూరు శ్రీకాకుళం జిల్లా భగీరథపురం. తల్లిదండ్రులు జయలక్ష్మి, శ్రీనివాస్. తాతయ్య, అమ్మమ్మ నగరంలో ఉండడంతో వాళ్ల దగ్గరే పెరిగా. వారి స్ఫూర్తితో కొలువు సాధించా.
– కేవీఎన్.శ్రీరామ్, విజయనగరం

తల్లి కష్టానికి ప్రతిఫలం..

మాది పేద కుటుంబం. తండ్రి గొల్లయ్య పదేళ్ల క్రితం మరణించారు. తల్లి సత్తెమ్మ కష్టపడి చదవించారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యా. ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలని విజయనగరంలో ఉంటూ సాధన చేశా. ట్యూషన్లు చెప్పేవాడిని. అలా వచ్చిన నగదుతో ఫీజులు కట్టేవాడిని. తాజా డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ కేటగిరీలో 82.23 మార్కులు వచ్చాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో 5వ ర్యాంకు సాధించా. నా మాతృమూర్తి కష్టానికి ప్రతిఫలం దక్కింది.
– వై.గణేష్, గదబవలస



– న్యూస్‌టుడే, విద్యావిభాగం, గరివిడి, గుర్ల

ఉరేసుకుని కార్మికుడి ఆత్మహత్య?


దేవుడునాయుడు (పాతచిత్రం)

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ బీకాలనీ సమీపంలో ఓ కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై గోపాలరావు వివరాల ప్రకారం.. వేపాడ మండలం పెద్దగుడిపాలెం గ్రామానికి చెందిన దేవుడునాయుడు(32) అరకులోయలోని ఓ మిఠాయి దుకాణంలో పది రోజుల క్రితం పనిలో చేరాడు. మరో దుకాణంలో పనిచేస్తున్న చిన్న అనే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని నాలుగు రోజుల కిత్రం తెలిసిన వ్యక్తికి ఇచ్చాడు. సదరు వ్యక్తి వాహనం తీసుకురాలేదు. దీనిపై చిన్న ప్రశ్నించడంతో మానసిక వేదనకు గురై ప్రాణాలు తీసుకుని ఉంటాడని ఎస్సై తెలిపారు. అయితే ఆత్మహత్య కాదని బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రుణ భారంతో వ్యాపారి ఆత్మహత్యాయత్నం

భోగాపురం, న్యూస్‌టుడే: 'ఎంతో ప్రశాంతంగా సాగిన నా జీవితం మూడు నెలల్లో ఒక్కసారిగా తలకిందులైంది. నిజాయతీగా నేను చేస్తున్న చిట్టీలు, వ్యాపారాల్లో ఏనాడూ మాట పడలేదు. కొందరు నాకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకపోవడంతో తీసుకున్న అప్పులను తీర్చలేకపోతున్నా. ఆస్తులు అమ్మినా తీరని పరిస్థితి. ఇక నాకు మరణమే శరణ్యమని భావించా' అంటూ భోగాపురానికి చెందిన వ్యాపారి టి.మురళి సుందరపేట ఆసుపత్రిలో అపస్మారక స్థితిలోకి వెళ్లకముందు చెప్పిన మాటలివి.. అప్పుల బాధ భరించలేక గడ్డిమందు తాగి ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన గురువారం స్థానికంగా చోటుచేసుకుంది. ఉదయం నిద్రమాత్రలు, గడ్డిమందు తాగి గ్రామ పెద్దల వద్దకు వెళ్లి తాను చేసిన తప్పునకు కుటుంబం బలికాకూడదు అంటూ వారి వద్ద మొరపెట్టుకుంటూ కుప్పకూలారు. వెంటనే వారు సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యుడు వెంకటేశ్ పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యానికి విజయనగరం తీసుకెళ్లాలని సూచించారు. ఆయనకు భార్య తులసి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి ఈయన వద్దే ఉంటున్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ తౌడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించినట్లు సీఐ ప్రభాకరరావు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.


చికిత్స పొందుతున్న మురళి

చికిత్స పొందుతూ బాలిక మృతి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ బాలిక చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. కురుపాం మండలానికి చెందిన బాలిక సరిగ్గా చదువుకోవడం లేదని, కళాశాలకు వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో గత నెల 20న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కురుపాం సీహెచ్‌సీకి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం, అక్కడి నుంచి విజయనగరం, విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చంపావతి తీరంలో గంజాయి


మాట్లాడుతున్న డీఎస్పీ

గుర్ల, న్యూస్‌టుడే: మండలంలోని చంపావతి నదీ తీరంలో గంజాయి అమ్మకాలు సాగిస్తున్న, కొనుగోలు చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను డీఎస్పీ రాఘవులు గురువారం సాయంత్రం వెల్లడించారు. అరకు మండలం సుంకరమెట్టకు చెందిన ఎం.అప్పన్న, అలమండకు చెందిన డి.గాంధీ ఎస్ఎస్ఆర్‌పేట సమీపంలోని నదీ పరివాహక ప్రాంతంలో కొంత మందికి గంజాయి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు సీఐ శంకరరావు, ఎస్సై నారాయణరావు సిబ్బందితో కలిసి దాడులు చేసి.. వారిద్దరితో పాటు విజయనగరానికి చెందిన మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కిలోల సరకు, అయిదు చరవాణులు, రూ.1250 నగదును స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ చెప్పారు. ఒడిశా నుంచి ఇక్కడకు తెచ్చి విక్రయిస్తున్నారని చెప్పారు.

నగరంలో అంతర్రాష్ట్ర మహిళా ముఠా హల్‌చల్


తాళాలు పగలగొడుతున్న మహిళలు

నేరవార్తావిభాగం: విజయనగరంలో అంతర్రాష్ట్ర మహిళా ముఠా హల్‌చల్ చేసింది. ఆరుగురు మహిళలు బుధవారం అర్ధరాత్రి పలు దుకాణాలకు వెళ్లి తాళాలు పగలగొట్టే ప్రయత్నం చేశారు. రాత్రి 2 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు పలు వీధుల్లో తిరిగారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో నిక్షిప్తం కావడంతో దుకాణదారులు భయాందోళన చెందారు. సదరు మహిళలు పగటి వేళ చెత్త ఏరుకుంటున్నట్లు.. బిక్షాటన చేస్తూ వీధుల్లో తిరుగుతున్నట్లు తెలుస్తోంది. వారి సంచుల్లో షట్టర్లు, తలుపులను పగలగొట్టే పరికరాలు ఉన్నాయి. రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు భావిస్తున్నారు. ఈమేరకు వివరాలు సేకరిస్తున్నామని ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.

పెనుగొల్లులో లారీ, ఆర్టీసీ బస్సు ఢీ

జిల్లావాసికి తీవ్ర గాయాలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ నుంచి సూపర్ లగ్జరీ నాన్‌స్టాప్ 36 మందితో విశాఖ బయలుదేరింది. పెనుగొల్లు వద్ద ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై విభీషణరావు బస్సును పరిశీలించి, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో విజయనగరానికి చెందిన ఎం.చాణక్యకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం విశాఖలో చికిత్స పొందుతున్నారు.

20 అడుగుల లోయలో వ్యాన్ బోల్తా: కూలీ దుర్మరణం


వాహనం వద్ద మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అమ్మన్నరావు


సతీష్(పాతచిత్రం)

సీతంపేట, న్యూస్‌టుడే: వ్యాను అదుపుతప్పి లోయలో పడడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన సీతంపేట మండలం చోటుచేసుకుంది. ఎస్సై అమ్మన్నరావు వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట నుంచి చరవాణి టవర్ల సామగ్రితో వస్తున్న వ్యాను కోతాం సమీపంలోని ఘాట్ రోడ్డులో బ్రేకులు విఫలమవడంతో అదుపు తప్పి 20 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కూలి కె.సతీష్(33) అక్కడికక్కడే మృతిచెందాడు. చోదకుడు లోవరాజు, మరో వ్యక్తి శ్రీను గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


దుర్గమ్మగా రామలింగాపురం మానసాదేవి

అమ్మలగన్నమ్మా.. ఆదుకోవమ్మా

దుర్గాష్టమి సందర్భంగా గురువారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. రామలింగాపురం మానసాదేవిని దుర్గమ్మగా పూజించారు. నగరంలోని నాగోజీపేట దుర్గాలమ్మను గాజులతో అలంకరించారు.
– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్, చీపురుపల్లి గ్రామీణం


గాజుల అలంకరణలో నాగోజీపేట దుర్గాలమ్మ

అవార్డులొచ్చాక.. అటకెక్కించారు

– న్యూస్‌టుడే, బొబ్బిలి

చెత్త శుద్ధిలో బొబ్బిలి పురపాలిక ఒకప్పుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలోనూ పేరు తెచ్చుకుంది. ఇంటింటా చెత్త సేకరణలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో, జాతీయ స్థాయిలో 501 ర్యాంకును సాధించింది. జోనల్ స్థాయిలో ఎనిమిదో ర్యాంకును అందుకుంది. వ్యర్థాల నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించిన మూడు పట్టణాల్లో బొబ్బిలి కూడా ఒకటి. ఇదంతా ఒక ఎత్తయితే.. ప్రశంసలు దక్కాక.. ప్రాజెక్టునే పక్కన పెట్టేశారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం యూనిట్‌లో విలువైన యంత్రాలన్నీ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆందోళన వ్యక్తమవుతోంది.


నిరుపయోగంగా విలువైన యంత్రాలు

ప్రారంభంలోనే తుంచేశారు

తడి చెత్తతో వినూత్న పద్ధతిలో ఎరువు తయారీ చేసే విధానాన్ని గతేడాది డిసెంబరులో ప్రారంభించారు. లార్వా కంపోస్టు విధానంలో 15 రోజుల్లోనే ఎరువు సిద్ధమవుతుంది. రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా ఇక్కడ ప్రవేశపెట్టారు. ఇందుకోసం 30 ట్యాంకులు అమర్చారు. వీటిల్లో చెత్త, దానిపై బీఎస్ఎఫ్(బ్లాక్ సోల్జియర్ ఫ్లై) గుడ్లను వేస్తే. . అవి పురుగులుగా మారి తడిచెత్తను ఆహారంగా తింటాయి. అవి విసర్జించే వ్యర్థాలు ఎరువుగా మారుతాయి. ఇలా రోజుకు 40 కిలోల చొప్పున ఈ ప్రక్రియలో వినియోగించేవారు. మొదట్లో కొన్నిరోజుల పాటు బాగానే పనిచేసినా.. అనంతరం ఆపేశారు.

ప్రక్రియలన్నీ మూలకు..

చెత్తశుద్ధి పార్కు నిర్మాణం, ప్లాస్టిక్ నిషేధం, తడిచెత్తతో ఎరువు తయారీ, పొడిచెత్తలో పనికొచ్చే వ్యర్థాలు విక్రయించడం, బయోగ్యాస్‌తో విద్యుత్తు తదితర ప్రక్రియలతో పట్టణం దేశంలోనే ఆదర్శంగా పేరు తెచ్చుకుంది. ఇప్పుడీ విధానాలు వెతికినా కనిపించడం లేదు. తడిచెత్త నిర్వహణను ప్రత్యేక ఏజెన్సీకి అప్పగించారు. పొడిచెత్త బాధ్యతను పురపాలిక చేపట్టింది. ఈ రెండూ ఆగిపోయాయి. ప్యాకింగు, పల్వరైజర్ యంత్రాలు, బయోగ్యాస్ ప్లాంటు మూలకు చేరాయి. వ్యర్థాలను వేరుచేసే యూనిట్‌కు తాళాలు వేశారు. గతంలో పొడి చెత్తతో ఏడాదికి రూ.1.50 లక్షల చొప్పున ఆదాయం వచ్చేది. ఎరువు అమ్మకాల ద్వారా రూ.2 లక్షలు దక్కేది. ఇప్పుడు రూపాయి కూడా అందని పరిస్థితి. పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి యంత్రాలు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు.


సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం వద్ద పనిచేయని యూనిట్

హోటళ్లపై ఆకస్మిక దాడులు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాలతో ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు గురువారం జిల్లా కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ విభాగం పర్యవేక్షణాధికారిణి ఎస్.ఈశ్వరి పైడితల్లి అమ్మవారి ఆలయంలో ప్రసాదం తయారీ విభాగాన్ని పరిశీలించారు. నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగుల్ మీరా తన బృందంతో కలిసి పలు హోటళ్లు, అల్పాహార దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. తయారీదారులు తీసుకుంటున్న జాగ్రత్తలు, వాడుతున్న ఆహార పదార్థాలు, పాటిస్తున్న నియమ, నిబంధనలను చూశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


ప్రసాదాలను పరిశీలిస్తున్న ఈశ్వరి

ఉపాధి పనుల నమోదుకు కొత్త బోర్డులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలకు సంబంధించి సమాచారం పొందుపరిచేందుకు కొత్తగా బోర్డులు రూపొందించారు. గతంలో సిమెంటు బోర్డులు నిర్మించి వాటిపై వివరాలు రాసేవారు. 2024-25 ఏడాదిలో చేపడుతున్న పనులకు కొత్త రకం ఏర్పాటు చేయాలని నమూనా రూపొందించి పంపించారు. చేపట్టిన పనులు, పూర్తయినవి, సిమెంటు రహదారులు, తారు రోడ్లు, గోకులాలు, పండ్ల తోటలు, పంట కాలువల వివరాలు రాయనున్నట్లు బొబ్బిలి ఏపీవో లక్ష్మీపతిరాజు తెలిపారు.



ఏర్పాటు కానున్న బోర్డు నమూనా

చికెన్ ధరలు

రకం	బ్యాగ్/లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

బొబ్బిలి

● బొబ్బిలి ● రాజాం ● గజపతినగరం ● చీపురుపల్లి

జాతీయస్థాయి పోటీలకు మౌనిక

రామభద్రపురం, న్యూస్‌టుడే: కొట్టక్కి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఆర్.మౌనిక సాఫ్ట్‌బాల్ క్రీడలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఏలూరు జిల్లా పెదవేగిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున రాణించింది. వచ్చే నెల గుజరాత్‌లో జరగనున్న పోటీల్లో బాలిక పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఆర్.భాస్కరరావు తెలిపారు. పీడీ బి.రత్నకిషోర్, స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కృష్ణ, జడ్పీటీసీ సభ్యురాలు ఎ.సరస్వతి, సర్పంచి అనురాధ అభినందించారు.


బాలికను అభినందిస్తున్న హెచ్‌ఎం భాస్కరరావు, పీడీ

దరఖాస్తుల ఆహ్వానం

రేగిడి, న్యూస్‌టుడే: లక్ష్మీపురం ఉన్నత పాఠశాల టైప్-4 కేజీబీవీ వసతి గృహంలో పనిచేసేందుకు బోధనేతర సిబ్బంది నియామకానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ప్రసాదరావు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికే వీటిని భర్తీ చేయనున్నట్లు వివరించారు. వంట మనిషి, సహాయ వంటమనిషి, స్కావెంజర్, స్వీపర్, నైట్ వాచ్‌మెన్ తాత్కాలిక పద్ధతిలో పనిచేసేందుకు ఈనెల 15లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. నమూనా దరఖాస్తులు ఎంఈవో కార్యాలయంలో ఉంటాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? మురపాక గ్రామంలో తాగునీటి కుళాయిల చుట్టూ చేరిన మురుగుతో దుర్గంధం వెదజల్లుతోంది. **- స్థానికులు**

● తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తాం. **- భానోజీరావు, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? గరుడుబిల్లి గ్రామంలోని ఇళ్ల ముందున్న కాలువలపై స్లాబులు, మెట్లు నిర్మించడంతో మురుగు తొలగించడానికి ఇబ్బందులు వస్తున్నాయి. దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. **- అప్పలనాయుడు, గ్రామస్థుడు**

● త్వరలో గ్రామాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- ఎ.రఘుపతిరావు, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, బొండపల్లి

రతన్ టాటా మరణం తీరని లోటు

న్యూస్‌టుడే, బొబ్బిలి, దత్తిరాజేరు

ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని పలు సంఘాల నేతలు అన్నారు. గురువారం సాయంత్రం బొబ్బిలి గాంధీ బొమ్మ కూడలిలో రోటరీ, కారుణ్య సంస్థల ప్రతినిధులు, విద్యావేత్తలు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. రోటరీ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు, కళింగ వైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు, పలువురు సామాజిక కార్యకర్తలు రతన్ టాటా సేవలను కొనియాడారు.


బొబ్బిలి పట్టణంలో కొవ్వొత్తులతో నివాళి

● భారతీయ ముద్దు బిడ్డ రతన్ టాటా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన మహా మనిషి అని మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు దత్తిరాజేరులో అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.


పాతబొబ్బిలిలో మౌనం పాటిస్తున్న మెప్మా ప్రతినిధులు

'ఆయన సేవలు నిరుపమానం'

రాజాం, న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సంతాపం తెలిపారు. దేశ ప్రగతి, అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని రాజాంలో గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విలువతో కూడిన వ్యాపారం చేసి స్ఫూర్తిగా నిలిచారని, కొవిడ్ సమయంలో ఆయన అందించిన సేవలు నిరుపమానమన్నారు.


కోండ్రు మురళీమోహన్

మేడలన్నీ తోటలు చేద్దాం

మహిళల్లో అవగాహనకు పురపాలక శ్రీకారం

న్యూస్‌టుడే, బొబ్బిలి

బొబ్బిలి పట్టణాల్లో మిద్దె తోటల పెంపకంపై పురపాలిక ప్రత్యేక దృష్టి సారించింది. మహిళలకు అవగాహన కల్పించే దిశగా కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్వయంగా పండించిన కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతోపాటు ఖర్చులు తగ్గుతాయని, పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందని భావించింది. ఖాళీ సమయంలో ఇంటి పరిసరాలు, మేడపై కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలను పెంచాలని సచివాలయ ఉద్యోగులతో చైతన్యం కల్పిస్తున్నట్లు కమిషనర్ రామలక్ష్మి చెప్పారు.


వెలమవారివీధిలో మొక్కల్ని పరిశీలిస్తున్న సచివాలయ ఉద్యోగులు


సేంద్రియ ఎరువు తయారీకి ప్లాస్టిక్ బుట్టను అందజేస్తున్న కమిషనర్ రామలక్ష్మి తదితరులు

● వంట గదిలో ఏర్పడే వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు పురపాలిక నుంచి ప్లాస్టిక్ బుట్టలు, రసాయనాలు మహిళలకు ఉచితంగా అందజేస్తున్నారు. దీంతోపాటు ఎరువు తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. పురపాలక సచివాలయ ఉద్యోగులు వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి ఆసక్తి ఉన్న వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

క్షేత్రస్థాయిలో శిక్షణ

పట్టణంలోని మెహర్ వీధి, వెలమవారి వీధుల్లో పలువురు మహిళలు వినూత్నమైన రీతిలో తోటలను పెంచుతున్నారు. స్థానికంగా అందుబాటులోలేని పండ్ల మొక్కలు, రకరకాల పూలు, ఆయుర్వేద, కూరగాయల మొక్కలను మేడలపై పెంచుతున్నారు. కుటుంబ అవసరాలకై మిగిలినవి బంధువులు, స్నేహితులకు అందిస్తున్నారు. అలాంటి వారి ఇళ్లకు పురపాలక సచివాలయ ఉద్యోగులను తీసుకెళ్లి శిక్షణ ఇస్తున్నారు. ఏ విధంగా మొక్కలు పెంచుతున్నారు, ఫలితాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగులకు లక్ష్యాలను విధించి మిగిలిన వారితో సాగు చేయించే విధంగా చర్యలు చేపట్టారు.

ఆరోగ్యంతోపాటు ఆదా..

మేడలన్నీ పచ్చగా మారడంతోపాటు ఇంటిపై కూరగాయలు, పండ్ల పెంపకం వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఖర్చు తగ్గుతుంది. ఇప్పటికే పట్టణంలోని 40 బహుళ అంతస్తుల భవనాలను గుర్తించాం. వారికి అవగాహన కల్పించి రకరకాల పండ్ల, కూరగాయల మొక్కలు నాటిస్తున్నాం. అలాంటి వారికి సూచనలు ఇచ్చేందుకు సచివాలయ ఉద్యోగులకు ముందుగా శిక్షణ ఇచ్చాం. బాగా మిద్దె పంటలు పెంచుతున్న వారిని గుర్తించి వారి వద్దకు వెళ్లి అనుభవాలు తెలుసుకుంటున్నాం. ఈ విధానంతో పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతాం. పురపాలక నుంచి అన్ని విధాలుగా సహాయం అందిస్తాం.

– ఎల్. రామలక్ష్మి, పుర కమిషనర్, బొబ్బిలి

ఇద్దరు వ్యక్తుల అరెస్టు

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఆరికతోట జాతీయ రహదారి వద్ద వ్యానులో విద్యుత్తు నియంత్రిక రాగితీగలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు గురువారం రాత్రి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఆరికతోటలో నియంత్రిక రాగితీగలు చోరీకి గురైనట్లు సర్పంచి పి.పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. ఈ క్రమంలో విజయనగరంలోని కేఎల్‌పురం ప్రాంతానికి చెందిన రామ్‌సింగ్, హరదీప్ సింగ్ వ్యానులో 70 కిలోల రాగితీగలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిపై ఇప్పటికే 14 కేసులు ఉన్నాయని చెప్పారు. నిందితుల్ని కోర్టుకు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు. సీఐ నారాయణరావు, ఎస్ఐ వై.ప్రసాదరావు ఉన్నారు.

గ్రామ పంచాయతీలకు పెద్దపీట


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

మెరకముడిదాం, న్యూస్‌టుడే: అభివృద్ధిలో గ్రామ పంచాయతీలకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. మెరకముడిదాంలో జరిగిన ప్రజాదర్బార్‌లో మాట్లాడారు. గ్రామాల్లో త్వరలోనే సీసీ రహదారులు, కాలువల పనులు జరగనున్నాయన్నారు. చీపురుపల్లి రెస్కో అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన భరోసానిచ్చారు. తెదేపా మండలాధ్యక్షుడు టి.సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ కె.మోతీలాల్‌నాయుడు, రమణమోహనరావు, కె.ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులతోనే పనులు చేయించండి

గరివిడి, న్యూస్‌టుడే: ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో చేపట్టబోయే పనులను సర్పంచుల ద్వారానే చేయించాలని సర్వసభ్య సమావేశంలో పలువురు డిమాండు చేశారు. ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ చంద్రశేఖర్ మాట్లాడారు. 675 పనులకు తీర్మానం చేసి పంపగా తొలివిడతగా 14 పంచాయతీల్లో 56 పనులకు ఆమోదం లభించిందన్నారు. గ్రామసభల్లో తీర్మానం అనంతరం పనులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు కోరారు. గరివిడి-గర్భాం మార్గం దుస్థితి, రైల్వే వంతెన రక్షణ గోడలు పాడవడం తదితర అంశాలపై చర్చించారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, వైద్యాధికారిణి దీప్తి తదితరులు పాల్గొన్నారు.


చర్చిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

యువత క్రీడల్లో రాణించాలి


సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి, న్యూస్‌టుడే: యువత క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం బొబ్బిలి షటిల్ బృందం ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో పోటీలు జరిగాయి. కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై దృష్టి సారించాలన్నారు. చాలామంది గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, జీవితాలు నాశనం అవుతాయని వివరించారు. యువత క్రీడల్లో రాణిస్తే అన్ని రంగాల్లో రాణించినట్లేనని సీఐ సతీష్ కుమార్ అన్నారు. పోటీల్లో 40 బృందాలు పాల్గొన్నాయి. నిర్వాహకుడు సురేష్, గ్రీన్‌బెల్టు అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి, వి.కృష్ణమూర్తి, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

150 మందికి ఆధార్ సేవలు

బొండపల్లి, న్యూస్‌టుడే: తపాలా శాఖ ద్వారా గ్రామీణ ప్రజలకు సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని గజపతినగరం పోస్టల్ పర్యవేక్షణాధికారి బి.ఉపేంద్ర అన్నారు. తపాలా వారోత్సవాల్లో భాగంగా గురువారం ఒంపల్లి గ్రామంలో ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గంట్యాడ, బొండపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన 150 మంది చేరుకుని ఆధార్ సేవలు పొందారు. జిల్లా తంతి తపాలా శాఖాధికారి కె.శ్రీనివాసరావు, అధికారులు కె.ఈశ్వరరావు, బీపీఎంలు బి.ప్రశాంత్, తెదేపా మాజీ ఎంపీటీసీ సభ్యుడు బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



వార్డు సభ్యుల పాత్ర కీలకం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వామ్యులు కావాలని జడ్పీ సీఈవో వీబీ సత్యనారాయణ కోరారు. బొబ్బిలి మండల పరిషత్తు కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో గురువారం పాల్గొని ధ్రువీకరణ పత్రాలు అందజేసి, మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులతో ఎక్కడ ఏయే పనులు చేస్తున్నారో చర్చించుకుని అందుకు తీర్మానాలు చేయాలన్నారు. వార్డు సభ్యులు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఆపై ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావుతో ఆయన సమీక్షించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేయాలన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.


సమీక్షిస్తున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

వేతన బకాయిలు చెల్లించాలి

రాజాం, గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు (ఆయాలు)గా పనిచేస్తున్న వారి వేతనాలు చెల్లించాలని మండల అధ్యక్ష, కార్యదర్శులు పార్వతి, అనురాధ డిమాండ్ చేశారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. తమను కార్మికులుగా గుర్తించాలని, వేతనాలను పెంచాలంటూ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అరుణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఏఈ బాధ్యతల స్వీకరణ

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: గృహనిర్మాణ శాఖ ఏఈగా రాజేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో భోగాపురం ఏఈగా పనిచేశారు. ఇక్కడ ఉన్న శ్రీనివాస్ ఎస్.కోటకు బదిలీ అయ్యారు.

జీవామృతం పంటలకు నేస్తం

రేగిడి, న్యూస్‌టుడే: జీవామృతం పంటలకు నేస్తం వంటిదని ప్రకృతి సేద్యం సీఆర్పీ పి.తవిటినాయుడు అన్నారు. సంకిలి షుగర్స్ ఆధ్వర్యంలో కొమెర చెరకు రైతులకు దీని తయారీ, వినియోగం, ఉపయోగాలను వివరించారు. కర్మాగారం అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: సీబీఎం పాఠశాల స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ రద్దు చేసి కరస్పాండెంటుపై చర్యలు తీసుకోవాలని వామపక్ష నాయకులు డిమాండు చేశారు. గురువారం పాఠశాల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఐ, అఖిల భారత విద్యార్థి యువజన సంఘాలు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, రైతు సంక్షేమ సంఘ నేతలు ఎం.శ్రీనివాసరావు, కె.అప్పన్న, వి.లక్ష్మునాయుడు, కె.సునీల్‌కుమార్, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మెట్టపల్లిలో పూరిల్లు దగ్ధం

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మెట్టపల్లిలో బి.అప్పలసూరికి చెందిన పూరిల్లు గురువారం దగ్ధమైంది. స్థానిక అగ్నిమాపకదళ అధికారి డి.హేమసుందరరావు ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.లక్ష మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

కొనుగోలు కేంద్రాల నిర్వహణపై శిక్షణ

బొబ్బిలి, న్యూస్‌టుడే: పంట నమోదు, వరి పంట కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతు సేవా కేంద్రాల సిబ్బందికి స్థానిక ఏడీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు. ఏడీ శ్యామ్‌సుందరరావు మాట్లాడుతూ.. త్వరలో ప్రభుత్వం వరి పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుందన్నారు. వాటిని ఎలా నిర్వహించాలో తెలియజేశారు. సస్యరక్షణ, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మండల అధికారులు ఉన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

బాడంగి(రామభద్రపురం), న్యూస్‌టుడే: రావివలస గ్రామానికి చెందిన పి.ఆనంద్ తన భార్య సుధతో కలిసి గురువారం ద్విచక్ర వాహనంపై డొంకినవలస ఎత్తుఖానా వద్ద వేగనియంత్రికపై వస్తుండగా అదుపుతప్పి బోల్తాపడ్డారు. ప్రమాదంలో సుధకు తీవ్ర గాయాలు కాగా బాడంగి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

పూజించి.. తరించి..


దుర్గాదేవి అలంకారంలో చీపురుపల్లి కనకమహాలక్ష్మి


దిబ్బగుడివలసలో సామూహిక కుంకుమ పూజలు

చీపురుపల్లి, గ్రామీణం, బొబ్బిలి గ్రామీణం, వంగర: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా చీపురుపల్లిలో కనకమహాలక్ష్మి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అష్టోత్తర శత కలశాభిషేకం, లక్ష కుంకుమార్చన జరిగాయి. వంగర మండలం రుషింగి దుర్గాభవానీ అమ్మవారిని దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుషార్‌రావు దంపతులు దర్శించుకున్నారు.

ఇదేం పారిశుద్ధ్య నిర్వహణ?

గజపతినగరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో బి.కళ్యాణి అన్నారు. సీతారాంపురంలో నిర్వహించిన గ్రామ సందర్శనలో భాగంగా వీధుల్లో పర్యటించారు. చెత్త, నీటి నిల్వపై సచివాలయ సిబ్బందిని ప్రశ్నించారు. ఈవోపీఆర్డీ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందిని ప్రశ్నిస్తున్న కళ్యాణి

మానసిక ఆరోగ్యంతోనే ప్రశాంతత

చీపురుపల్లి, బొబ్బిలి, న్యూస్‌టుడే: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చీపురుపల్లిలో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. మానసిక ఆరోగ్యంతోనే ప్రశాంతత లభిస్తుందని వైద్యులు నాయక్, కుమార్, శ్రీనివాసరావు రోగులకు అవగాహన కల్పించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. బొబ్బిలి సామాజిక ఆసుపత్రి ఇన్‌ఛార్జి శశిభూషణరావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ మాట్లాడారు. మానసిక రోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ


చీపురుపల్లి: అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామంలో ఉన్న ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు రావడం లేదని, సమస్యను పరిష్కరించాలని బొమ్మినాయుడువలస ఎస్సీ కాలనీవాసులు ఎంపీడీవో శ్రీనివాసరావుకు తెలిపారు. బొమ్మినాయుడువలసలో జరిగిన గ్రామ సందర్శనలో పలు వినతులు అందించారు. ● **చీపురుపల్లి గ్రామీణం:** గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులంతా పని చేయాలని ప్రత్యేకాధికారిణి, జిల్లా విపత్తుల నిర్వహణ డిప్యూటీ కలెక్టరు ఎం.రాజేశ్వరి సూచించారు. ఇటకర్లపల్లిలో జరిగిన గ్రామ సందర్శనలో మాట్లాడారు.

అధికారులపై గ్రామస్థుల మండిపాటు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇసుక దొరక్కపోవడంతో ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. గురువారం గింజేరు గ్రామంలో జరిగిన గ్రామ సందర్శన కార్యక్రమంలో మండిపడ్డారు. ఉచిత ఇసుక ఇస్తామని చెబుతున్నారు తప్పా ఇంతవరకు ఏ ఒక్క లబ్ధిదారునికి సరఫరా చేయలేదన్నారు రూ.వేలు ఖర్చు చేసి ఇసుకను కొనుగోలు చేస్తున్నట్లు కొందరు వాపోయారు. సమస్యను పరిష్కరిస్తామని గృహనిర్మాణశాఖ సహాయ డీఈ రాజగోపాల్ అన్నారు. ఎంపీడీవో రమణమూర్తి ఉన్నారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

గ్రామస్థాయి నుంచి తెదేపాకు బలం


సభ్యత్వ నమోదులో బంగార్రాజు, నాయకులు

భోగాపురం, న్యూస్‌టుడే: తెదేపా క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం పోలిపల్లిలో మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ఈ సందర్భంగా మాట్లాడారు. నియోజకవర్గం పార్టీకి కంచుకోట అన్నారు. గ్రామ స్థాయి నుంచి సభ్యత్వాలు నమోదు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. నాయకులు ప్రసాద్, కర్రోతు రాజు, బాలకృష్ణ పాల్గొన్నారు. అనంతరం బంగార్రాజు నందిగాంలో గ్రామసందర్శనలో పాల్గొన్నారు. సర్పంచి మురళీమోహన్, స్థానికులు సమస్యలు తెలిపారు.

మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి డా.విజయ చందర్

కొత్తవలస, న్యూస్‌టుడే: మానసిక ఆరోగ్యమే మహాభాగ్యమని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి డా. ఎస్. విజయ చందర్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆంజనేయపేట వద్దగల చైతన్య బదిరులు, మానసిక దివ్యాంగుల పాఠశాలలో గురువారం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ వ్యక్తి మానసిక ఆరోగ్యం ఆరోగ్యకరమైన సమాజానికి కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. వ్యవస్థాపకులు సన్యాసిరావును అభినందించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మేయరు విజయలక్ష్మి

అజెండాలోని అన్ని అంశాలకూ పచ్చజెండా

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన తొమ్మిది అంశాలు, టేబుల్ అజెండాగా తెచ్చిన అయిదింటిని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అంతకుముందు మేయరు విజయలక్ష్మి మాట్లాడారు. అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో ఉంటేనే బిల్లులు చెల్లించాలని సభ్యుడు రాజేష్ కోరారు. పండగ నేపథ్యంలో రోడ్ల మరమ్మతు పనులు సాగుతున్నాయని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.50 లక్షలతో పెయింటింగ్ పనులు చేపడుతున్నామన్నారు. సహాయక కమిషనరు సీహెచ్.తిరుమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, రేగాన రూపాదేవి, సుంకరి నారాయణస్వామి, జీవీ.రంగారావు అధికారులు పాల్గొన్నారు.

చెత్త శుద్ధి ప్లాంటు నిర్మాణానికి స్థల పరిశీలన

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల నగర పంచాయతీలో చెత్త శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గురువారం సారిపల్లి ప్రారిశ్రామిక వాడలో ఉన్న డంపింగ్‌యార్డ్ వద్ద కమిషనరు కె.అప్పలరాజు, తరుణి ఏజెన్సీ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌ఛార్జి డి.ఉమా భాస్కర్, ఏఈ ఇన్‌ఛార్జి త్రినాథ్ పాల్గొన్నారు.

ఆ రూ.14.97 కోట్లు నిరుపయోగమేనా?

- గత ప్రభుత్వంలో కాలువల నిర్మాణానికి చేసిన ఖర్చు
- ఇంకా అస్తవ్యస్తంగా మురుగు వ్యవస్థ

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విద్యల నగరం.. చిన్నపాటి వర్షం పడినా ముంపునకు గురవుతోంది. రోడ్లన్నీ చెరువులు అవుతున్నాయి. గత ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించామని గొప్పల డప్పులు వాయించినా.. క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రధాన రహదారులపై డ్రైనేజీల నీరు చేరి అధ్వానంగా మారుతున్నాయి. రాకపోకలకు పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగేళ్లలో కాలువలు ఆక్రమణలకు గురవడం, వాటిపైనే నిర్మాణాలు చేపట్టడం, నిర్వహణ లేకపోవడమే దీనికి ప్రధాన కారణంగా ఆరోపణలు వస్తున్నాయి.


వీటీ అగ్రహారం గాంధీ నగర్ దారిలో కాలువలు కనిపించని దుస్థితి

జిల్లా కేంద్రం.. సుమారు మూడు లక్షలకు పైగా జనాభా ఉండే నగరంలో రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వందలాది కి.మీ. పరిధిలో పక్కా కాలువలు లేవు. ఇక కొత్త కాలనీల పరిస్థితి సరేసరి. ఉన్న కాలువల్లోనూ నిర్వహణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో మురుగు పేరుకుపోయి ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కాలువల ఆక్రమణలతో పాటు వాటిపైనే గచ్చులు, స్లాబులు, దుకాణాల డిస్‌ప్లే బోర్డులు, బడ్డీల ఏర్పాటు, నిర్మాణాలు చేపట్టడంతో ఎక్కడికక్కడే నిర్వహణకు ఆటంకం ఏర్పడుతోంది. గతంలో రహదారుల విస్తరణ చేసిన చోట్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాలువలపై మళ్లీ నిర్మాణాలు చేసేశారు.

ఇదీ పరిస్థితి...

- జనాభా: 3.12 లక్షలు
- కాలువలు: 700 కి.మీ.
- కచ్చా కాలువలు: 80 కి.మీ.
- శిథిలావస్థలో ఉన్నవి: 30 కి.మీ.

నిధులు వెచ్చించినా..

నగరంలో పలువురి వినతుల మేరకు.. గతంలో కాలువల నిర్మాణం కోసం రూ.14.97 కోట్లు వివిధ పథకాల ద్వారా అప్పటి ప్రభుత్వం ఖర్చు చేసింది. పూర్తిస్థాయిలో సమస్య తీరలేదు. నిర్మించిన చోట్లా నాసిరకంగా ఉండడంతో సమస్య మళ్లీ ఉత్పన్నమవుతోంది. ఆక్రమణలపై పలువురు ఫిర్యాదులు చేస్తున్నా.. నేతల సిఫార్సుల కారణంగా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అటు వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉందని వాపోతున్నారు.

ఎక్కడెక్కడ సమస్యంటే..

వీటీ అగ్రహారం గణేష్‌నగర్, చిన్నవీధి, పెద్దవీధి, రైల్వే స్టేషన్ రోడ్డు, మంచుకొండవారి వీధి, రింగ్‌రోడ్డు, గుమ్చీ రోడ్, కన్యకాపరమేశ్వరి కోవెల వెనుక, డాబాతోట, రంగయ్య వీధి, ఎంజీ రోడ్, డీసీసీబీ దారి, ధర్మపురి దారి, సీబీ కాలనీ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతం, తోటపాలెం, సిటీ స్టాండ్, గంటస్తంభం ప్రాంతం, అంబటిసత్రం రోడ్డు, వుడా కాలనీ, కంటోన్మెంట్ తదితర చోట్ల ఈ సమస్య ఉంది. ముఖ్యంగా వాణిజ్య ప్రాంతాల్లోని రోడ్లు, కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. పెద్దచెరువు పరిధిలోని అదనపు సాగునీటి పారుదల కాలువ ఆక్రమణకు గురికావడంతో భారీ వర్షాలు పడితే పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి.

పెద్దల అండతో పాగా..

నగరంలోని కొన్నిచోట్ల కాలువల ఆక్రమణలపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఆక్రమణదారులకు అప్పటి నేతల అండ కారణంగా తొలగించలేదు. కొన్నాళ్ల కిందట రైల్వేస్టేషన్ రోడ్డులో నగర పాలక సంస్థ తొలగింపు చేపట్టగా, నేతల సిఫార్సులు రావడంతో విడిచిపెట్టేశారు. భగవాన్ నగర్ సమీపంలో పెద్ద చెరువు అదనపు నీటి పారుదల కాలువ ఆక్రమణలతో కుచించుకుపోయింది. కాలువల్లో మురుగు పేరుకుపోయి దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

పరిశీలించి తొలగిస్తాం...

కాలువలను ఆక్రమించి భవనాలు నిర్మిస్తే తొలగిస్తాం. పారిశుద్ధ్య పనులకు ఎక్కడైనా ఆటంకం కలిగిస్తే ఉపేక్షించం. వెంటనే చర్యలు తీసుకుంటాం.
– పి.నల్లనయ్య, కమిషనరు, నగర పాలక సంస్థ

ఉత్సవ సందడి



పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ సందడి రెట్టింపైంది. మరో నాలుగు రోజుల్లో ఉత్సవం జరగనుండగా భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. గురువారం రాత్రి జొన్నగుడి ప్రజలు వివిధ వేషధారణల్లో తల్లిని దర్శించారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలి



విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు కంది వెంకటరమణ, పువ్వల శ్రీనివాసరావు కోరారు. సంఘం కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ దసరా కానుకగా ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ లేదా డీఏని ప్రకటించాలని డిమాండు చేశారు. ఎల్‌టీసీ పునరుద్ధరణ, పదవీ విరమణ చేసినవారికి ప్రయోజనాలు కల్పించాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను నిర్ణీత గడువులోగా చెల్లించాలని, పీఆర్సీ ప్రకటించాలన్నారు. నాయకులు పి.భూషణరావు, బాలాజీ, ఎన్.వెంకటేశ్వరరావు, లెంక సత్తిబాబు, వెంకట సతీష్, బి.చంద్రశేఖర్, కె.పెంటంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోండి


కేంద్రం నిర్వహిస్తున్న తపాలాశాఖ అధికారులు

జరజాపుపేట(నెల్లిమర్ల), న్యూస్‌టుడే: నూతన ఆధార్‌కార్డులు, చేర్పులు, మార్పులు చేపట్టేందుకు ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని విజయనగరం పశ్చిమ సబ్‌డివిజన్ తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ సూచించారు. జరజాపుపేట ప్రాంతంలో నల్లి సూరిబాబు స్మారక ప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని తపాలాశాఖ వారోత్సవాల్లో భాగంగా ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆయనను స్థానికులు సన్మానించారు. నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ రామారావు, ఎస్వీఎం ఎర్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

పోలీసు అధికారుల బదిలీ

నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో పలువురు పోలీసు అధికారులకు బదిలీ అయింది. అసిస్టెంటు కమాండెంటు (గ్రౌండ్స్) నుంచి ఎం.వెంకటేశ్వరరావు విజయనగరం 5వ బెటాలియన్‌కు రానున్నారు. విజయనగరం పీటీసీ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న టి.ఆనందబాబు గ్రూపు కమాండర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పల్నాడు జిల్లాలో ఏఆర్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న డి.రామచంద్రరాజు నియమితులయ్యారు. చిత్తూరు అదనపు ఎస్పీగా పనిచేస్తున్న జి.నాగేశ్వరరావు విజయనగరం ఏఆర్ విభాగానికి వస్తున్నారు.


కొత్తఅగ్రహారం శివాలయంలో సహస్ర కుంకుమార్చన


వేపాడ మండలం బల్లంకి గ్రామంలో 22 కిలోల లడ్డూ ప్రసాదానికి నిర్వహించిన వేలంలో ఎన్.సత్యనారాయణ దంపతులు రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు.

దుర్గాలమ్మా.. కరుణించమ్మా


ఎల్.కోటలో సామూహిక పూజలు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. దుర్గాష్టమి సందర్భంగా పైడితల్లి వనంగుడిలో వేంచేసిన దుర్గాలమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. గాజులరేగ కొండపల్లివారితోటలో జాంగ్రీ అలంకరణలో కొలువుదీరారు. నాగోజీపేటలో గాజుల అలంకరణలో దర్శనభాగ్యం కల్పించారు. – న్యూస్‌టుడే బృందం


అన్నమరాజుపేటలో దుర్గాదేవి


పెదతాడివాడలో దుర్గామాత అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారు


జాంగ్రీల అలంకరణలో కొండపల్లివారితోట దుర్గాలమ్మ


దుర్గాదేవిగా వనంగుడి అమ్మవారు

సంక్షిప్త సమాచారం

ఒకే పట్టాపై రెండు రైళ్లు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు ఒకదాని వెనుక మరొకటి వెళ్లిన ఘటన గురువారం కొత్తవలస- కంటకాపల్లి సమీపంలో చోటు చేసుకుంది. విజయనగరం నుంచి విశాఖ వెళ్తున్న రెండు రైళ్లు నెమ్మదిగా ఒకదాని వెంట మరొకటి వెళ్తున్న దృశ్యాలు కొంతమంది వారి చరవాణిల్లో చిత్రీకరించి.. సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో విషయం వైరల్ అయ్యింది. ఆటో సిగ్నల్ వ్యవస్థ వల్ల ఇబ్బంది ఉండదని రైల్వే వర్గాలు తెలిపాయి.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

ఎస్.కోట, న్యూస్‌టుడే: గంజాయి రవాణా కేసులో ఏ1గా ఉన్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చామని సీఐ నారాయణమూర్తి తెలిపారు. ఏప్రిల్‌లో 200 కిలోల గంజాయిని వాహనంలో తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా పాడువా సమీప బోస్‌పుట్ గ్రామానికి చెందిన పాటి కైలాను గురువారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ మెయిన్ గేటు వద్ద అరెస్టు చేశామన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక



జామి, న్యూస్‌టుడే: జామి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పి.జస్వంత్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ చంద్రశేఖర్ తెలిపారు. 7,8,9 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికయ్యాడన్నారు.

ఆశ్రమాల్లో అన్నదానం

కొత్తవలస: సుబ్బలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెందుర్తి లయోలా వృద్ధాశ్రమంలో 120 మందికి, కొత్తవలసలోని చైతన్య బదిరులు, మానసిక దివ్యాంగుల పాఠశాలలో 45 మందికి, బలిఘట్టం దగ్గరున్న న్యూ హోప్ అనాథాశ్రమంలో 40 మంది పిల్లలకు అన్నదానం చేశారు. ప్రవాస భారతీయులు డి.విజయలక్ష్మి, వి.సునీత, తనూజ ఆర్థిక సహాయంతో నిర్వహించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు శివ తెలిపారు.

మర్యాద పూర్వక కలయిక

ఎస్.కోట: ఇటీవల ఏపీ ఎంఎస్‌ఎంఈ ఛైర్మన్ పదవిలో నియామకమైన తమ్మిరెడ్డి శివశంకర్‌ను నియోజకవర్గ జనసేన నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు జిల్లా ప్రచార కార్యదర్శి మల్లువలస శ్రీనుతో కలిసి వెళ్లి గురువారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. బొడ్డవరలో జిందాల్ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు.

చెరువులు ఆక్రమిస్తే చర్యలు

పూసపాటిరేగ: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్ఐ మాధురి, మండల సర్వేయర్ గణపతిరావు అన్నారు. కోనాడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 50లో అదే గ్రామానికి చెందిన వ్యక్తులు చెరువు ఆక్రమించి 2.24 ఎకరాల్లో సరుగుడు తోట వేశారు. దీనిపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

గ్రామానికి రహదారి నిర్మించరూ


హెచ్‌డీటీ భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న చీడిపాలెం గిరిజనులు

ఎస్.కోట, ఎల్.కోట, న్యూస్‌టుడే: మా గిరిజన గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎస్.కోట మండలం చీడిపాలెం గ్రామస్థులు గురువారం ఎల్.కోటలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కలిసి విన్నవించుకున్నారు. జాతీయ రహదారికి సుమారు రెండు కి.మీ దూరంలో ఉన్న 120 కుటుంబాలు నివసిస్తున్న గ్రామానికి రోడ్డు లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే జిందాల్ కంపెనీ యాజమాన్యం ద్వారా రోడ్డు వేయించాలని కలెక్టరుకు లేఖ రాశారు. అంతకు ముందు హెచ్‌డీటీ భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.


ఎస్పీకి వినతిపత్రమిస్తున్న భీశెట్టి బాబ్జీ

సైబర్ నేరాలపై చర్యలు తీసుకోండి

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లా ప్రజలు సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారని, బాధితులకు అండగా తగిన చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ భీశెట్టి బాబ్జీ కోరారు. ఈమేరకు గురువారం ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కొందరు పోలీసుల వేషంలో తమ దందా కొనసాగిస్తున్నారన్నారు. విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రతన్ టాటా మృతికి సంతాపం తెలిపారు.

అలరించిన నృత్యాలు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని మహారాజా మహిళా రిక్రియేషన్ క్లబ్‌లో గురువారం రాత్రి చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సహాసిని, బాల పూజలు జరిగాయి. పైడితల్లి చదురుగుడిలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్


చిన్నారుల భరతనాట్యం